క్లుప్తంగా

తాగి వాహనం నడిపిన వారికి జరిమానా

అద్దంకి: మద్యం తాగి వాహనం నడిపిన తొమ్మిది మంది వ్యక్తులను సీఐ సుబ్బారాజు శుక్రవారం కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. వారికి జడ్జి ఒక్కోరికి రూ.2 వేలు వంతున జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సుప్రీం తీర్పు కూటమికి చెంప పెట్టు

అద్దంకి: కొమ్మినేని అరెస్ట్ విషయంలో సుప్రీం తీర్పు చంద్రబాబు ప్రభుత్వానికి చెంప పెట్టు అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త పానెం చిన హనిమిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వానికి సుప్రీం తీర్పు కను విప్పు కావాలన్నారు. ప్రతికా స్వేచ్ఛ ప్రాముఖ్యతను కోర్టు నొక్కి చెప్పిందన్నారు. కూటమి ప్రభుత్వానికి ఇదో గుణపాఠం కావాలన్నారు. కక్షపూరిత ధోరణిని ఆపి, ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులేసి ప్రజల మన్ననలు పొందాలని హితవు పలికారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు.

అగ్నిమాపక కేంద్రం తాత్కాలికంగా మార్పు

చీరాల అర్బన్: మున్సిపల్ కార్యాలయం ఎదురుగా గల అగ్నిమాపక కేంద్రాన్ని తాత్కాలికంగా మార్పు చేస్తున్నట్లు జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి వీవీ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. అగ్నిమాపక కేంద్రం పాత భవనాన్ని తొలగించి నూతన భవనం నిర్మాణం చేపట్టనున్న దృష్ట్యా ప్రస్తుతం ఉన్న అగ్నిమాపక కేంద్రాన్ని చీరాల సాల్మన్ సెంటర్‌లోని బేర్ క్రిస్టియన్ హాస్పిటల్ ప్రాంగణంలోకి మార్పుతున్నట్లు తెలిపారు. అగ్నిప్రమాదం వంటి అత్యవసర పరిస్థితుల్లో 101, 08594-232299 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

దరఖాస్తు చేసుకోండి

ఇంకొల్లు(చినగంజాం): ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఇడుపులపాడు 1,2 సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న 2 ఆశా కార్యకర్తల పోస్టులకోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఇంకొల్లు వైద్యాధికారి డాక్టర్ టి. అంజలి తెలియజేశారు. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదలయిందని అర్హులైన వారు ఈ నెల 17 వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని దరఖాస్తుల కోసం ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపర్ వైజర్‌ను సంప్రదించాలని కోరారు. దరఖాస్తు దారులు ఆయా సచివాలయాల పరిధిలోని వారై ఉండాలని ఆమె సూచించారు.

ఏపీ మోడల్ స్కూల్‌లో దరఖాస్తుల ఆహ్వానం

చీరాల అర్బన్: చీరాల ఏపీ మోడల్ స్కూల్‌లో 6,7,8,9, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్లలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.సరళ శుక్రవారం తెలిపారు. విద్యార్థులు ఈనెల 20 వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలానే ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సీట్లు కేటాయించామన్నారు. జిల్లా ఎంపిక కమిటి ఆధ్వర్యంలో పదో తరగతి ఫలితాల ఆధారంగా రిజర్వేషన్ ప్రకారం విద్యార్థులకు సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందించామని, సర్టిఫికెట్లుతో ప్రిన్సిపాల్‌ను సంప్రదించి రాలన్నారు.

బడి ఈడు పిల్లల్ని పాఠశాలకు పంపండి



కోనంకి ఎస్సీ కాలనీలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మార్టూరు: బడి ఈడు వయసు వచ్చిన పిల్లల్ని తల్లిదండ్రులు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోనంకి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చందలూరి సుధారాణి అన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాల పునః ప్రారంభమైన సందర్భంలో శుక్రవారం సాయంత్రం పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి గ్రామాల్లోని వీధుల వెంట పర్యటిస్తూ పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు.

రికార్డులు పరిశీలించిన ఎంపీడీఓ



కొణికిలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని కొణికి గ్రామ పంచాయతీ రికార్డులను ఎంపీడీఓ జి. శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కార్యదర్శి అడ్డగడ వెంకటేశ్వర్లును ఆదేశించారు. ప్రధానంగా తాగునీటి చెరువు పరిశీలన.. గ్రామంలో నీటి సరఫరా పలు అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పేరాల కారంచేడు రైల్వేగేటు సమీపంలో రైలు పట్టాల కిందుగా పైపులైన్ నిర్మాణం చేస్తున్న కూలీలు



నీటిని సరఫరాచేసేది ఈ ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచే..

అంగట్లో నీటి చుక్క

- రక్షిత మంచినీరు ఐఎల్‌టీడీ కంపెనీకి ధారాదత్తం
- మున్సిపాలిటీకి ఏడాదికి నీటి ఆదాయం రూ. 20 లక్షలంటూ ప్రచారం
- గతేదాడి మున్సిపాలిటీతో ఒప్పందం చేసుకున్న కంపెనీ
- రైల్వే పట్టాల కింద నుంచి పైప్‌లైన్ పనులు ప్రారంభించిన కంపెనీ నిర్వాహకులు
- లక్షలాది మంది పట్టణ ప్రజల నీటి అవసరాలు తీరేదెల?



జాన్‌పేట వద్ద భూమిలో వేస్తున్న పైపులైన్

చీరాల రూరల్: మున్సిపాలిటీ అధికారురులకు ప్రజల బాగోగుల గురించి కంటే పైసలపైనే మమకారం పెంచుకున్నట్లుంది. ఐఎల్‌టీడీ కంపెనీకి నీటి అవసరాలు తీర్చేందుకు గతేడాది మున్సిపాలిటీతో యాజమాన్యం చేసుకున్న ఒప్పందం ప్రకారం నీటి దోపిడీకి రంగం సిద్ధమైంది. కంపెనీ నిర్వాహకులు వారం రోజులు నుంచి ముమ్మరంగా పనులు చేయిస్తున్నారు. కారంచేడు గేటు సెంటర్‌లోని ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి రైలు పట్టాల కింద ద్వారా ఐఎల్‌టీడీ కంపెనీ వరకు పైపులైన్ పనులు ప్రారంభం అయ్యాయి.

అవసరం ఉన్నా..

వందేళ్లకుపైగా ఘన చరిత్ర కలిగి వేలమంది కార్మికులను, ఉద్యోగులున్న ఐఎల్‌టీడీ కంపెనీకి చీరాల మున్సిపాలిటీ నుంచి రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీటిని తీసుకోవాల్సిన ఆవశ్యకత వచ్చింది. ఈ క్రమంలో గతేడాది జనవరి 31న మున్సిపాలిటీతో ఐఎల్‌టీడీ కంపెనీ యాజమాన్యం రూ. 98,000 చెల్లించి అగ్రిమెంట్ చేసుకుంది. దీని ప్రకారం మున్సిపల్ నిర్వహణలో నడిచే సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నుంచి ప్రతిరోజూ ఐఎల్‌టీడీ కంపెనీకి మూడు లక్షల ఇరవై వేల లీటర్లు మంచినీరు ఇవ్వాల్సి ఉంటుంది. ఆ నీటిని 2,300 మంది వరకు తాగవచ్చు. అందుకుగాను మున్సిపాలిటీకి ఐఎల్‌టీడీ కంపెనీవారు రోజుకు సుమారుగా రూ. 5,000 చెల్లించాల్సి ఉంటుంది. అంటే ఏడాదికి సుమారుగా రూ. 18 నుండి 20 లక్షల ఆదాయం మున్సిపాటీకి చేకూరుతుందన్నమాట. ప్రజల అవసరాలకు సరిపడా రక్షిత మంచినీటి చెరువులో నీటి లభ్యత లేకపోతే కంపెనీవారికి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే ఒప్పందాన్ని రద్దు చేసుకునే వెసులుబాటు ఉంటుందని చెబుతున్నారు.

ఆదాయం సరే.. ప్రజల అవసరాలు తీరేనా?

మున్సిపాలిటీకి ఆదాయం సమకూరటం అటుంచితే భవిష్యత్తులో ప్రజల అవసరాలకు నీటి వనరుల కొరత ఉంటుందని, ఇబ్బందులు తప్పవని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. చీరాల పట్టణంలో 33 మున్సిపల్ వార్డులున్నాయి. సుమారుగా రెండు లక్షల పైగా జనాభా ఉన్నారు. సుమారుగా 23 వేలకుపైగా హౌస్‌హోల్డ్స్, 11 వేలకుపైగా మంచినీటి పైపు కనెక్షన్లున్నాయి. అంటే ఈ లెక్కన దాదాపుగా సగం ఇళ్లకు పైపులైన్ కనెక్షన్‌లు లేనట్టే. ముఖ్యంగా పట్టణంలోని అనేక శివారు ప్రాంతాలకు మంచినీటి పైపులైన్ కనెక్షన్‌లు ఇంతవరకు వేయనేలేదు. పట్టణంలో నివాసముంటున్న ఇళ్లన్నింటికీ పూర్తిస్థాయిలో పైప్‌లైన్ కనెక్షన్‌లు ఇస్తే ఇప్పుడున్న రక్షిత మంచినీటి చెరువులోని నీరు ప్రజల అవసరాలకు ఏమాత్రం సరిపోవు. అయినా మున్సిపల్ అధికారులు ఆదాయమే పరమావధిగా పని చేస్తున్నారు.

> **చర్యలు తీసుకుంటాం**
>
> ఐఎల్‌టీడీ కంపెనీకి రక్షిత మంచినీరు ఇవ్వడం వలన మున్సిపాలిటీకి ఏడాదికి రూ. 20 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. అలానే పట్టణ ప్రజలకు ఏ మాత్రం నీటి ఇబ్బందులు రానివ్వం. ప్రజల అవసరాలకు ఏమాత్రం భవిష్యత్తులో నీటి ఇబ్బందులు తలెత్తినా కంపెనీ వారికి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఒప్పందం రద్దు చేసుకుంటాం.
>
> – టి. రఘురాం, మున్సిపల్ డీఈ చీరాల

మంచినీటి ప్లాంట్ల నిర్వాహకుల దోపిడీ

పట్టణంలో ఏ సందులో చూసినా ఎటువంటి పర్మిషన్లు లేకుండా మినరల్ వాటర్ ప్లాంట్‌ల పేరుతో జనాల జేబులకు చిల్లులు పెడుతున్నారు. 20 లీటర్ల క్యాను రూ. 10, కూలింగ్ వాటర్ రూ. 25, ప్లాస్టిక్ బాటిల్‌లో లీటర్ నీటిని నింపి రూ. 10 విక్రయిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. కానీ అధికారులు ప్లాంట్ల నిర్వాహకులపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

ఇంకొల్లు(చినగంజాం): మండల వ్యవసాయాధికారిగా ఎస్. మేరిమ్మ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేస్తున్న వేణుగోపాల్ ఒంగోలు ప్రధాన కార్యాలయానికి బదిలీ కావడంతో ఆ స్థానంలో మేరిమ్మ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆమె యద్దనపూడి మండలంలో విధులు నిర్వహిస్తూ ఇక్కడికి చేరారు.

ఇంకొల్లు సీడీపీఓగా సులోచనా రాణి

ఇంకొల్లు(చినగంజాం): ఇంకొల్లు అంగన్‌వాడీ ప్రాజెక్ట్ సీడీపీఓగా సులోచనా రాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన సీడీపీఓ ఝాన్సీ బదిలీపై వేటపాలెంకు వెళ్ళగా ఆమె స్థానంలో సులోచనా రాణి చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల అభివృద్ధికి తాను కృషి చేస్తానని, సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

ఏఓ మేరమ్మకు సత్కారం

యద్దనపూడి: యద్దనపూడి మండలం నుంచి ఇంకొల్లు మండలానికి బదిలీపై వెళ్తున్న వ్యవసాయాధికారి మేరమ్మను కార్యాలయ సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. బల్లికురవ మండలం ఏఓగా పనిచేస్తున్న ఎస్‌పీపీ కుమారి యద్దనపూడి మండల వ్యవసాయాధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఏఈఓ ఆర్. మధుప్రియ, వీఏఏలు హరీష్, వినయ్, ఏసుబాబు, నరేంద్ర, లీలాసత్య, సుదర్శన పాల్గొన్నారు.

బల్లికురవ: మండల వ్యవసాయాధికారిగా శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కొరిశపాడు ఏవోగా పనిచేస్తూ బదిలీపై బల్లికురవ ఏవోగా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌పీపీ కుమారి యద్దనపూడి మండలానికి బదిలీపై వెళ్లారు. ఏఈవోలుగా మార్టూరు నుంచి మౌలాలి, అద్దంకి ల్యాబ్ నుంచి హరిత బదిలీపై ఇక్కడకు వచ్చి విధుల్లో చేరారు. ఐదు సంవత్సరాలుగా మండలంలో ఏఈవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బదిలీల్లో భాగంగా ఏఈవో పోస్టులు భర్తీ అయ్యాయి. రైతులకు అందుబాటులో ఉంటూ సలహాలు సూచనలతో సేవలు అందిస్తామని తెలిపారు.

వేటపాలెం ఎస్సైగా జనార్దన్

వేటపాలెం: మండల కేంద్రం వేటపాలెం ఎస్సైగా పి.జనార్దన్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన గుంటూరు జిల్లా నల్లపాడు పనిచేస్తు సాధారణ బదిలీల్లో భాగంగా వేటపాలెం ఎస్సైగా వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై టి. వెంకటేశ్వర్లు చీరాల టూ టౌన్ ఎస్సైగా బదిలీపై వెళ్లారు. అలాగే చీరాల తహసీల్దా కె. గోపీకృష్ణ వేటపాలెం తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు. వేటపాలెం తహసీల్దార్ పి. పార్వతి పై వచ్చిన పలు ఆరోపణ కారణంగా ఆమెను కలెక్టర్ జె. వెంకట మురళి తాత్కాలికంగా విధుల నుంచి పక్కన పెట్టినట్లు సమాచారం.

మలేరియా వ్యాధిపై అవగాహన



కారంచేడులో మలేరియా మాసోత్సవాల్లో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

కారంచేడు: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ మలేరియా వ్యాధిపై అవగాహన కలిగి ఉండేలా ప్రజల్లో చైతన్యం కల్పించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని కారంచేడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ గోరంట్ల సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి గ్రామంలో మలేరియా వ్యాధి నివారణ మాసోత్సవాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ×మలేరియా అంతం మనతోనేº అనే నినాదంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాడి పడేసిన కొబ్బరిబోండాలు, టీ కప్పులు, కుండీలు, నీటి తొట్లలో దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వారానికి ఒక సారి అయినా డ్రైడేను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఎల్‌టీ సుబ్బారావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాల కిట్‌లు పంపిణీ

వేటపాలెం: మండల పరిధిలోని కొత్తరెడ్డిపాలెం మండల పరిషత్ స్కూల్‌లోని విద్యార్థులకు హెచ్‌ఎం భవనం రాణి పుస్తకాల కిట్‌లను శుక్రవారం అందజేశారు. ప్రతి కిట్‌లో ఒక బ్యాగుతో పాటు మూడు జతల బట్టలు, బూట్లు, సాక్స్‌లు, టెక్స్ట్ పుస్తకాలు, రాత పుస్తకాలు ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులు చదువుల్లో రాణించాలని సూచించారు.



పుస్తకాల కిట్‌లు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్

పర్చూరు(చినగంజాం): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సచివాలయ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ వి. ప్రద్యుమ్న కుమార్ హెచ్చరించారు. శుక్రవారం నూతలపాడు, నాగులపాలెం గ్రామ సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. యోగాంధ్ర రిజిస్ట్రేషన్ సర్వేలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన వివిధ రకాల పథకాలకు సంబంధించిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి అలసత్వం వహించకుండా పనిచేయాలని కోరారు. సమయపాలన పాటిస్తూ సచివాలయాలకు హాజరు కావాలని సూచించారు. సచివాలయ సిబ్బంది మూడు పూటలా బయోమెట్రిక్ వేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈఓపీఆర్డీ కె. సత్యనారాయణ, సిబ్బంది పి. నారాయణరావు, కార్యదర్శులు కృష్ణమోహన్, సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీటీసీ మృతి

అద్దంకి: అనారోగ్యంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మణికేశ్వరం ఎంపీటీసీ దాసరి డానియేల్ అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పార్టీ నాయకడు పానెం నరింహారెడ్డి అన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, వ్యవసాయ విభాగం అధ్యక్షుడు ఈదా శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకుడు సోమా శ్రీనివాసరెడ్డి, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు సందర్శించి నివాళి అర్పించారు. పార్టీ శ్రేయస్సు కోసమే పాటుపడిన వ్యక్తి డానియేల్ అని కొనియాడారు.



భౌతిక కాయానికి నివాళి అర్పిస్తున్న పానెం నరసింహా రెడ్డి

పైప్‌లైన్ ఎయిర్ వాల్వుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

బల్లికురవ: రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా ధ్వంసమైన మంచినీటి పైపులైను ఎయిర్‌వాల్వును శుక్రవారం అధికారులు మరమ్మతులు చేశారు. దాంతో వృథాగా పోతున్న నీటికి చెక్ పెట్టారు. శుక్రవారం సాక్షిలో సాగరు నీరు వృథా అన్న శీర్షికకు అధికారులు తక్షణమే స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గిరినాయక్ ఆధ్వర్యంలో వైదన గ్రామం నుంచి సూరేపల్లి గ్రామానికి వెళ్తున్న మంచినీటి పథక పైపులైను పవర్ ప్లాంటు సమీపంలో ధ్వంసమై నీరు వృథాగా పోతోంది. ఇటీవల చెన్నుపల్లి-వైదన రోడ్డు అభివృద్ధిలో భాగంగా పైపులైను దెబ్బతిన్నది. సూరేపల్లి గ్రామానికి నీరు చేరడం లేదు. కాగా మరమ్మతులు చేపట్టడంతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి సూరేపల్లి గ్రామానికి నీరు చేరుతోంది. సకాలంలో స్పందించడం పట్ల సాక్షికి, అధికారులకు సూరేపల్లి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.



మరమ్మతులు చేస్తున్న పైపులైన్ ఇదే..

ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ ముఖ్యం

ఇంకొల్లు(చినగంజాం): ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ పట్ల అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రద్ధ తీసుకోవాలని ఇంకొల్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ జి. సులోచనారాణి అన్నారు. శుక్రవారం ఇంకొల్లు ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రాజెక్ట్ మీటింగ్ నిర్వహించారు. సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు వారి విధుల గురించి సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యక్రమాల గురించి కూలంకషంగా వివరించారు. షెడ్యూల్ ప్రకారం పీపీ1, పీపీ2 పిల్లలకు కృత్యాలు నేర్పించాలని, గ్రోత్ మానిటరింగ్, బరువు తక్కువ పిల్లలు, టీనేజ్ ప్రెగ్నెన్సీ, రక్తహీనత కలిగిన గర్భిణుల పట్ల ఎటువంటి శ్రద్ధ తీసుకోవాలి, అంగన్ వాడీ పరిశుభ్రత గురించి వారి పోషణ ట్రాకర్, యాప్‌లో అటెండెన్స్, ఎఫ్‌ఆర్‌ఎస్, ఈకేవైసీ గురించి వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు, యోగా శిక్షకులు ద్వారా యోగ నిర్వహించారు. సూపర్ వైజర్‌లు వాణిశ్రీ,బేబి, సుమలత, హిమబిందు, సునీత, వాణి, ఉష, మూడు మండలాల సూపర్ వైజర్‌లు పాల్గొన్నారు.



ఇంకొల్లులో మాట్లాడుతున్న సీడీపీఓ సులోచనారాణి

జాబ్ మేళాలో 64 మంది ఎంపిక

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులోని వీఎస్ఆర్ అండ్ఎమ్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 64 మంది నిరుద్యోగ యువకులను వివిధ కంపెనీల ప్రతినిధులు ఎంపిక చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రావి అంకమ్మ చౌదరి తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 159 మంది అభ్యర్థులు హాజరు కాగా వారిలో 64 మందికి ఉద్యోగ అవకాశాలు లభించినట్లు తెలిపారు.



మార్టూరులో ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులు

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

కొడవలివారిపాలెం (కారంచేడు): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలని హెచ్‌ఎం ఏ. ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన పాఠశాల పునః ప్రారంభం సందర్భంగా విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికి తీసేలా వారికి పలు పోటీలను నిర్వహించారు. 8,9,10 తరగతుల విద్యార్థులకు చిత్రలేఖనం, విజేతలకు బహుమతులు అందించారు.



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కార్యకర్తకు పరామర్శ

జె.పంగులూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్త నాయిరాం రాజేష్‌ని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజక వర్గ ఇన్‌చార్జ్ పానెం చినహనిమిరెడ్డి సోదరుడు నరసింహారెడ్డి శుక్రవారం పరామర్శించాడు. చందలూరులోని రాజేష్ ఇంటి వద్ద వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ పార్టీ కార్యకర్తలకు ఎప్పుడు అండగా ఉంటుందని, ఎవ్వరూ అధైర్య పడవద్దని తెలిపారు. రాజేష్ త్వరగా కొలుకొని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రావూరి శ్రీనివాసరావు, కోటయ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా మినీ యోగా ర్యాలీ



పర్చూరు బొమ్మల సెంటర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పర్చూరు(చినగంజాం): అంతర్జాతీయ యోగా దినోత్సవం ఈ నెల 21 న నిర్వహించనున్న దృష్ట్యా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల యోగా పర్యవేక్షకులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. పర్చూరు బొమ్మల సెంటర్ వద్ద ఉప్పుటూరు హోమియో వైద్యులు, మాస్టర్ ట్రైనర్, పర్చూరు మండల యోగ పర్యవేక్షణాధికారి డాక్టర్ దాసరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం మినీ యోగా ర్యాలీ నిర్వహించారు. బొమ్మల సెంటర్‌లో డాక్టర్ చంద్రశేఖర్ యోగాసనాలు వేసి ప్రజలను చైతన్యవంతులు చేశారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుగుతుందని మండలంలో మొత్తం 200 యోగా వేదికలు న్నాయన్నారు. ఎస్ఐ మాల్యాద్రి, వీఆర్వో యార్లగడ్డ శ్రీనివాసులు, కుంభా సాయి ప్రకాశ్, ఉప్పుటూరు సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు రామరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.